సాక్షి అనకాపల్లి

శనివారం । 7 । అక్టోబర్ । 2023



సత్వర పరిష్కారానికే..

మాకవరపాలెంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కలెక్టర్, జేసీ అర్జీలు స్వీకరించారు. 8లో



మురిసిన మర్రివలస

కె.కోటపాడు మండలంలోని మర్రివలసలో 8న సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించనున్నారు. 8లో

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న 34.8, 8న 34.2, 9న 33.7, 10న 33.4, 11న 33.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

14 నూతన సబ్ స్టేషన్లకు ప్రతిపాదన



విద్యుత్‌శాఖ ఈఈ రామకృష్ణ

మాకవరపాలెం: నర్సీపట్నం డివిజన్ పరిధిలో 14 విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు పంపామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. స్థానిక సబ్ స్టేషన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ లోవోల్టేజీ సమస్య నివారణకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా కొత్తగా నర్సీపట్నం టౌన్, ధర్మసాగరం, డి.యర్రవరం, తంగేడు, బూరుగుపాలెం, జి.కోడూరు, చినబొడ్డేపల్లి, చీడిగుమ్మల, నర్సయ్యపేట, చౌడువాడ, కె.పి.అగ్రహారం, కె.వల్లాపురం, కొంతలం, చింతలపూడిలో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. మరో 10 సబ్ స్టేషన్లలో లోడ్ పెంచేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతిపాదించామన్నారు. అగ్రికల్చర్ లైన్‌కు ప్రత్యేకంగా, గృహ, వాణిజ్య అవసరాలకు ప్రత్యేకంగా 24 గంటలు విద్యుత్ అందించేందుకు అవసరమైన నూతన విద్యుత్ లైన్ పనులను కె.కోట మండలం కన్నూరుపాలెం నుంచి ప్రారంభించినట్టు చెప్పారు. ఆయన వెంట ఏఈ బాలకృష్ణ ఉన్నారు.

ఆరోగ్య సురక్ష ఫోల్డర్, సంచుల తయారీకి టెండర్లు

తుమ్మపాల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఫోల్డర్స్, సంచుల ముద్రణ, సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల దరఖాస్తులను www.జీ.వీజ జౌరి. జీ వెబ్‌సైట్‌లో ఈ నెల 7 నుంచి 9 లోపు సమర్పించాలన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయాన్ని పనివేళల్లో ఎన్‌హెచ్‌ఎం, డీపీఎం యూనిట్‌లో సంప్రదించాలన్నారు.

బైక్ మెకానిక్‌ను బలిగొన్న ఆన్‌లైన్ జూదం

అప్పుల బాధ భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య



వాటర్ ట్యాంక్ నిచ్చెనకు వేలాడుతున్న ప్రసాద్ మృతదేహం

నర్సీపట్నం: ఆన్‌లైన్ జూదం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. జూదం మైకంలో ఎక్కడపడితే అక్కడ అప్పులు చేయడంతో తలకు మించి భారంగా మారాయి. వీటి బాధ భరించలేక బైక్ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం నర్సీపట్నంలో చోటు చేసుకుంది. టౌన్ ఎస్సై అందించిన వివరాల ప్రకారం... మున్సిపాలిటీ పరిధి వెంకునాయుడుపేటలో జె.ప్రసాద్ (32) తన కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడి రూ.16 లక్షల వరకు పలువురి వద్ద అప్పులు చేశాడు. వారి నుంచి వస్తున్న ఒత్తిళ్లు తట్టుకోలేక తన నివాసం ఉంటున్న మేడపైన వాటర్ ట్యాంక్ నిచ్చెనకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో 1 నంబర్



- రోజుకు సగటున 4 నిమిషాలు మాత్రమే పవర్ 'కట్'
- సర్కిల్ పరిధిలో తగ్గుతున్న సరఫరా అంతరాయం
- 2 నెలలుగా 9 నిమిషాలు.. అక్టోబర్‌లో నాలుగు నిమిషాలు మాత్రమే
- పునరుద్ధరణ పనుల్లో వినూత్న ప్రణాళికలు
- ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దూకుడుగా విశాఖపట్నం సర్కిల్

గాలి వీచిందా..? అయితే కరెంట్ గోవిందా.? వర్షం పడుతోందా..? టార్చ్‌లైట్స్, చార్జింగ్ లైట్స్ వెతుక్కోవాల్సిందే.
గంటల తరబడి కరెంట్ రాదు.
ఏంటో ఈ పవర్ సప్లై ..
ఇదీ ఒకప్పుడు వినియోగదారుల నుంచి తరచూ వినిపించిన మాట..
కాలం మారింది.. కరెంట్ సరఫరాలోనూ మార్పులు వచ్చాయి. సరఫరా అంతరాయం తగ్గింది. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విశాఖ సర్కిల్ నిరంతరం శ్రమిస్తోంది. అందుకే సగటున పవర్ కట్‌ను రోజులో కేవలం 4 నిమిషాలకు మాత్రమే తగ్గించుకుంటూ ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న సర్కిళ్లలో నంబర్ వన్‌లో కొనసాగుతోంది. విద్యుత్ సరఫరా విషయంలో విశాఖ దూకుడుగా వ్యవహరిస్తోందని సైదీ సైఫీ సూచీలే స్పష్టం చేస్తున్నాయి.

– సాక్షి, విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో 5 సర్కిల్స్ ఉన్నాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం సర్కిల్స్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలే సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైదీ), సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ). రోజూ ఆయా సర్కిల్స్ పరిధిలో ఎంత సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.? ఎంత సమయానికి పునరుద్ధరించారు.? ఇలాంటి వివరాలను ఎప్పటికప్పుడు గణిస్తూ సరాసరిని చూపిస్తుంటుంది. ఈ విషయంలో విశాఖ సర్కిల్ నంబర్‌వన్‌లో నిలిచింది. ఈ సర్కిల్ పరిధిలో 17,57,727 మంది వినియోగదారులున్నారు. ఇందులో 15,02,204 డొమెస్టిక్ కనెక్షన్లుండగా, 1,70,580 కమర్షియల్, 49,037 అగ్రికల్చర్, 30,632 ఇన్‌స్టిట్యూషనల్, 5,274 ఇండస్ట్రీస్ కనెక్షన్లున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని సైదీ సైఫీ ర్యాంకింగ్‌ను ప్రకటిస్తుంది.

నాలుగు నిమిషాలు మాత్రమే..

2014–19 మధ్య కాలంతో పోల్చితే సర్కిల్ పరిధిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ కాలంలో రోజుకు సగటున 60 నుంచి 85 నిమిషాల వరకూ విద్యుత్ అంతరాయం ఉండేది. అంటే 24 గంటల్లో కనీసం గంటకు పైగా కరెంట్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవి. పంపిణీ విషయంలో పక్కాగా వ్యవహరిస్తూ ఆధునిక సాంకేతికతను సిబ్బంది అందిపుచ్చుకుంటూ సరఫరా అంతరాయాన్ని తగ్గించారు. గంట ఉండే అంతరాయం క్రమంగా నిమిషాలకు చేరుకుంది. ఇప్పుడు కేవలం 4 నుంచి 10 నిమిషాలు మాత్రమే రోజులో విద్యుత్ అంతరాయం ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సగటున రోజుకు 9 నిమిషాలు మాత్రమే సరఫరాకు అంతరాయం ఉండగా.. ఈ నెలలో కేవలం 4 నిమిషాలు మాత్రమే సగటు ఇంట్రప్షన్ ఉన్నట్లు సైదీ సైఫీ నివేదికలో స్పష్టమైంది.

నంబర్ వన్ ర్యాంకులో... విశాఖ సర్కిల్

గత కొద్ది నెలలుగా విశాఖ సర్కిల్ సైదీ సైఫీ ర్యాంకింగ్‌లో నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయాలు లేకుండా అందించడంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది సఫలీకృతమవుతున్నారు. తర్వాత ర్యాంకింగ్స్‌లో రాజమండ్రి, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం ఉన్నాయి. కేవలం సర్కిల్ మాత్రమే కాకుండా.. ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఇంట్రప్షన్ తగ్గిస్తూ సరఫరా అందిస్తున్నారు.

విశాఖ సర్కిల్‌లో 4 నిమిషాలు మాత్రమే ఉండగా రాజమహేంద్రవరంలో 8 నిమిషాలు, శ్రీకాకుళం పరిధిలో 10, విజయనగరంలో 13, ఏలూరులో 16 నిమిషాలు మాత్రమే రోజుకు సగటున విద్యుత్ కోతలు జరుగుతున్నట్లు సైదీ సైఫీ ర్యాంకింగ్స్‌లో స్పష్టమైంది.

విశాఖ సర్కిల్‌లో కనెక్షన్లు

మొత్తం:	17,57,727
డొమెస్టిక్ :	15,02,204
కమర్షియల్:	1,70,580
అగ్రికల్చర్:	49,037
ఇన్‌స్టిట్యూషనల్ :	30,632
ఇండస్ట్రీస్:	5,274

ఏపీఈపీడీసీఎల్ సర్కిల్స్ పరిధిలో సైదీ సైఫీ పెర్ఫార్మెన్స్ వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	రోజులో సరఫరా సమయం(గం.లలో)	అంతరాయ సమయం (ని.లలో)	ర్యాంకు
విశాఖపట్నం	933	23:55:42	4.17	01
రాజమహేంద్రవరం	953	23:51:12	8:47	02
శ్రీకాకుళం	353	23:49:08	10:51	03
విజయనగరం	425	23:46:09	13:50	04
ఏలూరు	1158	23:43:21	16:38	05



ట్రాన్స్‌ఫార్మర్‌లో తలెత్తిన లోపాలను సరిచేస్తూ..

మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నాం



ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాం. వినియోగదారులకు ఇచ్చే విద్యుత్‌ను నాణ్యంగా ఎలా అందించాలనే అంశంపై సీఎండీ సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. దానికనుగుణంగా మార్పులు చేస్తూ అంతరాయాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నాం. ప్రస్తుతం సగటున 4 నిమిషాలున్న ఇంట్రప్షన్‌ను క్రమంగా తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. విపత్తుల కారణంగా ఏదైనా అవాంతరాలు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇటీవలే ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌ను రూపొందించాం. మిగిలిన చోట్లా అదే తరహా టెక్నాలజీ వస్తే ఈ అంతరాయం మరింత తగ్గించగలం.

– ఎల్ మహేంద్రనాథ్,
ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్‌ఈ

పోలీసు సిబ్బందిపై ఆర్మీ ఉద్యోగి దాడి

గాయాలపాలైన రావికమతం ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, సిబ్బంది



నిందితుడు భాస్కరరావు

రావికమతం: ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, పోలీసు సిబ్బంది ఇద్దరిపై దాడి చేసి గాయపరచిన ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మేడివాడ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి గొర్లె భాస్కరరావుకు అదే గ్రామానికి చెందిన పతివాడ కోటేశ్వరరావుతో సరిహద్దు భూ వివాదాలున్నాయి. పలు మార్లు గొడవ పడటంతో తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న భాస్కరరా వు కత్తితో కోటేశ్వరరావు ఇంటికి వెళ్లగా వారు భయంతో పోలీసుల(112)కు ఫోన్ చేశారు. దీంతో రావికమతం ఏఎస్‌ఐ అప్పారావు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లగా సదరు ఆర్మీ ఉద్యోగి వారిపై తిరగబడ్డారు. దీంతో పోలీసులు తిరుగుముఖంపట్టారు. సంఘటనను ఎస్‌ఐ ఉమామహేశ్వరరావుకు వివరించారు. వారి వాంగ్మూలంతో భాస్కరరావుపై కేసు నమోదు చేశారు. దీనిపై శుక్రవారం భాస్కరరావును అరెస్ట్ చేసేందుకు ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు హెచ్‌సి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వెళ్లగా, సదరు ఆర్మీ ఉద్యోగి వీరిపైనా దాడికి దిగాడు. ఈ దాడిలో ఎస్‌ఐ మోచేతిపై గట్టిగా కరిచేశాడు. వంటిపై కూడా గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ అప్పారావుకు, హెచ్‌సీ శ్రీనివాస్ కూడా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న కొత్తకోట సీఐ, కొత్తకోట, బుచ్చెయ్యపేట ఎస్‌ఐలు, సిబ్బంది హుటాహుటిన మేడివాడ చేరుకుని, దాడికి పాల్పడిన ఆర్మీ ఉద్యోగిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టుచీరపై లలితా సహస్ర నామావళి



ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌కు చెందిన పి. బాల వెంకట సూర్య శకుంతల శశి పట్టు చీరపై లలితా సహస్ర నామావళి రాశారు. శశి ఏటా దేవి నవరాత్రులకు సామర్లకోట దరి రాయవరం దగ్గర ఉన్న విజయదుర్గ పీఠానికి వెళ్తుంటారు. పీఠంకు ఏటా చీరను బహూకరిస్తుంటారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

- అప్పుడే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు
- నెల రోజులపాటు 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం
- సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రచారం
- మంత్రి అమర్‌నాథ్ వెల్లడి

అనకాపల్లి టౌన్: రాష్ట్రానికి సువర్ణ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని, ఈ విషయం వివరించేందుకు 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలోని పార్టీ నేతలతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఒకటో తేదీన తెలవారకముందే ఇంటికి వెళ్లి పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదని, ఆయనకు మళ్లీ ప్రజలు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోపాటు, మరికొన్ని ఇతర పథకాలను కాపీ కొట్టి వాటిని అమలు చేస్తామని చెప్పి ప్రజలను మళ్లీ మోసం చేయడానికి చంద్రబాబు సిద్ధపడుతున్నట్లు ఆరోపించారు. 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నామన్నారు. నెల రోజులు జరిగే ఈ కార్యక్రమంలో సచివాలయాల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాల గురించి వివరిస్తామని, లబ్ధిదారులతో పార్టీ ముఖ్యనేతల ముఖాముఖి ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గృహ సారథులతో ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటామన్నారు. ప్రస్తుతం ఆరోగ్య సురక్ష కార్యక్రమం విస్తృతంగా జరుగుతున్నందున నవంబర్ 1న 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరుతున్నామన్నారు.

అధికారం కోసమే బాబు, పవన్‌ల చెలిమి

పవన్ కల్యాణ్ ఒకప్పుడు చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని, ఆ తర్వాత విడిపోయి మళ్లీ ఇప్పుడు పొత్తు కుదుర్చుకోవడాన్ని చూస్తే విడాకులు తీసుకున్న వాళ్లు మళ్లీ వివాహం చేసుకున్నట్లు ఉందని మంత్రి అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. వీరి అనుబంధం సక్రమమైంది కాదని, వారి వల్ల రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం చేకూరదన్నారు. ఇలాంటి వారు ఎంతమంది కలిసి వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టలేరన్నారు. ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తమకే దక్కిందన్నారు. నియోజకవర్గంలో నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు తన సొంత నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అనకాపల్లికి రావాల్సిన మెడికల్ కాలేజీ తరలిపోవడానికి, సుగర్ ఫ్యాక్టరీ మూతపడడానికి కారకులు ఎవరో ప్రజలకు తెలుసునన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి. రామ్మూర్తి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి. రత్నకుమారి, వివిధ దేవాలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, కర్రి మహాలక్ష్మీనాయుడు, తాతాజీ, ఆళ్ల నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు

'ఆరోగ్య సురక్ష'కు వెల్లువలా జనం



మునగపాక మండలం తోటాడలో జగనన్న ఆరోగ్య సురక్షకు ఓపీ నమోదు



శిరిజాంలో వృద్ధురాలికి సాయపడుతున్న డిప్యూటీ సీఎం బూడి

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు జనం వెల్లువలా వస్తున్నారు. తమ ప్రాంతానికే వైద్య నిపుణులు తరలిరావడంతో ప్రజలు వారి సేవలను వినియోగించుకుంటున్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చీడికాడ మండలం శిరిజాంలో, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చోడవరం మండలం జుత్తాడలో, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కశింకోట మండలం జి.భీమవరంలో సురక్ష వైద్య శిబిరాలను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు.

– సాక్షి న్యూస్ నెట్‌వర్క్

చెక్‌పోస్టుల ఏర్పాటుతో గంజాయికి అడ్డుకట్ట

- కె.కోటపాడు, ఎ.కోడూరు, అనకాపల్లి స్టేషన్లలో విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ తనిఖీలు
- విశాఖ రేంజ్‌కు జనవరిలో కొత్తగా 50 మంది ఎస్‌ఐల నియామకం

కె.కోటపాడు : చెక్‌పోస్టులతో పాటు, మొబైల్ చెక్‌పోస్టుల ఏర్పాటుతో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామని విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. కె.కోటపాడు సర్కిల్ కార్యాలయాన్ని, ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా జిల్లాలో చాలా వరకు తగ్గిందన్నారు. ప్రధానంగా గంజాయిని ఒడిశా మార్గం వైపు తరలించేందుకు మల్కాన్‌గిరి, కోరాపుట్ ప్రాంతాల వైపు వెళ్తున్నట్లు తెలిసిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య తక్కువగానే ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే పరిస్థితులను, ప్రాంతాలను ముందుగా గుర్తించి, హెచ్చరిక బోర్డులు, నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచి, శాంతి భద్రతల చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. దీపావళి పండగ నేపథ్యంలో లైసెన్స్ ఉన్నవారు జాగ్రత్తలను పాటిస్తూ, అమ్మకాలను జరపాలన్నారు. గతంలో లైసెన్స్‌లు లేకుండా విక్రయిస్తూ పట్టుబడ్డ వారికి విక్రయించకుండా పోలీస్ సిబ్బంది కౌన్సిలింగ్‌ను ఇస్తారని పేర్కొన్నారు.

జిల్లాలో 204 మంది సారా తయారీదారులకు రెవెన్యూ అధికారుల సహాయంతో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించినట్లు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు, కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు, ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ, కె.కోటపాడు ఎస్‌ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ హరికృష్ణ, పక్కన ఎస్పీ మురళీకృష్ణ

ఈ ఏడాది కొత్తగా 50 మంది ఎస్‌ఐలు

అనకాపల్లిటౌన్: విశాఖ రేంజ్ పరిధిలో కొత్తగా 50 మంది ఎస్‌ఐలను జనవరిలో ప్రభుత్వం భర్తీ చేయనున్నట్లు డీఐజీ హరికృష్ణ తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు బోర్డులు, డ్రమ్ములు ఏర్పాటు చేసి, వాహనాల వేగాన్ని నియంత్రించనున్నట్లు తెలిపారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నియమకాలు జరుగుతున్నాయని, త్వరలో పోస్టులు భర్తీచేస్తామన్నారు. జిల్లాకు 24 మంది ఏపీఎస్పీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో జాతీయ రహదారుల్లో వాహనదారులకు తమ సిబ్బంది వాహనాలను నిలిపి, చల్లని నీటితో ముఖప్రక్షాళన చేయించి, కునుకుపాట్లకు ఆస్కారం లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో మైనర్ డ్రైవింగ్ పెరిగిందని, ప్రత్యేక చర్యలు చేపడుతూ, వివిధ కాలేజీల్లో రోడ్డుప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎస్పీ కేవీ మురళీకృష్ణ, డీఎస్పీలు వి.సుబ్బరాజు, మళ్ల మహేష్, సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను, టి.లక్ష్మి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎకాడమిక్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి

పాయకరావుపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న విశాఖ పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన అండర్ –19 బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర జిల్లా జట్టుకు బి.క్రాంతి, బాలికల జట్టుకు పి.శ్రీనిధి, కె.వి.వి లక్ష్మీప్రసన్న, ఆర్.శ్రీరమావర్షిత ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ భానుమూర్తి శుక్రవారం తెలిపారు. వీరిని విద్యా సంస్థల అధినేత నరసింహారావు, ఎకాడమిక్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న 2005 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

రావికమతం: వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన కొత్తకోటకు చెందిన ప్రైవేటు టీచర్ పడమటి శ్రీనివాసరావుకు 2005 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం రూ.32 వేల సాయమందించారు. అతడి తల్లి సైతం హృద్రోగ సమస్యతో మంచం పట్టింది. వృద్ధ తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. దీనిపై 'అనుకోని ప్రమాదం అంతులేని ఆవేదన' శీర్షికన సాక్షిలో గత నెల 24న ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు.

సత్వర పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- మాకవరపాలెంలో స్పందనకు 316 అర్జీలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



వినతులు ఇచ్చేందుకు బారులు తీరిన అర్జీదారులు

మాకవరపాలెం: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం మాకవరపాలెంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జేసీ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, జిల్లా అధికారులతో కలసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భారీ ఎత్తున హాజరైన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన కలెక్టర్, జేసీలు వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల సమక్షంలో పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

222 అర్జీలు రెవెన్యూపరమైన సమస్యలే..

జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి 316 అర్జీలు అందాయి. వీటిలో అధికంగా 222 అర్జీలు రెవెన్యూపరమైన సమస్యలపైనే వచ్చాయి. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులకు సంబంధించి అర్జీలు ఉన్నాయి. రాచపల్లి రెవెన్యూ భూములను అన్‌రాక్ పరిశ్రమకు సేకరించగా మిగిలిఉన్న భూములను ఏపీఐఐసీగా నమోదు చేశారని గ్రామ మాజీ సర్పంచ్‌లు పెట్ల భద్రాచలం, దొరబాబు రైతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వాటిని రైతుల పేరున ఆన్‌లైన్ చేయాలని కోరారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో మాకవరపాలెంలో జనరిక్ మెడికల్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవిందరావు వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్ కార్యాలయాన్ని విశాఖకు తరలించకుండా నర్సీపట్నంలోనే ఉంచాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, రైతులతో కలిసి వినతి ఇచ్చారు. కార్యక్రమంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో హేమంత్, డీపీవో శిరీషా రాణి, మండల ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో అరుణశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ఆరా..

మాకవరపాలెం పీహెచ్‌సీని కలెక్టర్ సందర్శించారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నిత్యం వచ్చే రోగుల సంఖ్య, పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యాభివృద్ధికి ఉన్నత పాఠశాలలో ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) బోధనపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు ఈ ప్యానెల్ ద్వారా విద్యా బోధన ఎంతో అవసరమన్నారు.

ఇంటి స్థలం కోసం వినతి



మాది కొత్తపాలెం, అన్‌రాక్ భూ సేకరణ సమయంలో ఇంటిని కోల్పోయాం. ఇల్లు తొలగించిన వారికి అప్పటి ప్రభుత్వం ఐదు సెంట్ల స్థలాన్ని ఇచ్చింది. మాకు స్థలం ఇవ్వలేదు. స్థలం మంజూరుకు స్పందనలో దరఖాస్తు చేశాను.

– లాలం శాంతి, కొత్తపాలెం

రాయితీలు కోల్పోతున్నాం



ఏపీఐఐసీ పేరున నమోదైన మా భూములను మార్పు చేయాలి. 2008లో ఏపీఐఐసీ మా భూమిని సేకరించింది. మిగిలిన 1.50 ఎకరాల భూమిని ఏపీఐఐసీ పేరున నమోదు చేశారు. దీనివల్ల ప్రభుత్వ రాయితీలు కోల్పోతున్నాం.

– రుత్తల వరహాలబాబు, రాచపల్లి, నిర్వాసిత రైతు

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహం

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లిలో యాతపేటకు వెళ్లే రామాలయం వద్ద వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి ముక్కు నుంచి రక్తస్రావం అవుతోంది. మృతికి కారణాలు తెలియరాలేదు. స్థానికుల సమాచారం మేరకు టౌన్ ఎస్సై సుధాకర్, సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయి. స్కై బ్లూ షర్ట్, గ్రీన్‌లుంగీ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసి ఉంటే టౌన్ పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్సై సూచించారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత వాడ్రాపల్లి



క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఎస్‌ఐ అలీ

మునగపాక: క్రీడల ద్వారా మానసికోల్లాసంతోపాటు శరీర దారుఢ్యం పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాక మరిడిమాంబ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన గురువారం అర్ధరాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వాడ్రాపల్లి జట్టు విజేతగా నిలిచింది. మునగపాక ద్వితీయ, ఎం.జగన్నాథపురం తృతీయ, అచ్యుతాపురం చతుర్థ, తిమ్మరాజుపేట జట్టు పంచమ స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీలకు పెంటకోట శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఎస్‌ఐ మహమ్మద్ అలీ, ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

959 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుకున్న రేషన్ బియ్యంతో విజిలెన్స్ బృందం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం పూడిమడకలో రేషన్ బియ్యం నిల్వలపై సివిల్ సప్లయ్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ లక్ష్మోజి, సీఎస్‌డీటీ రాజేశ్వరిల బృందం ఇక్కడ నిల్వ చేసిన 19 బ్యాగ్‌లతో కూడిన 959 కేజీల బియ్యం స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు నిందితుడు కంబాల రాంబాబుపై 6ఏ కేసు నమోదు చేసింది.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

- పెళ్లైన రెండేళ్లకే బలవన్మరణం
- అనుమానం వ్యక్తం చేస్తున్న పోలీసులు



సాయి విమల మృతదేహం

యలమంచిలి: పట్టణంలోని ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్‌కు సమీపంలోని ఇంట్లో ఓ వివాహిత శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ కె.పాపినాయుడు వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన సాయి విమల(25)కు, యలమంచిలికి చెందిన అంగా శశికాంత్‌తో రెండేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఆర్నెల్ల కుమార్తె ఉంది. కరోనా సమయంలో శశికాంత్ తల్లి మరణించింది. అతడు వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానంలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో శశికాంత్ ఇంట్లో నిద్రిస్తుండగా సాయి విమల బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు భర్త, మామల వేధింపులే కారణమా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతురాలి పుట్టింటి వారు ఒడిశా నుంచి శనివారం ఉదయం ఇక్కడికి చేరుకోనున్నారు. అప్పటి వరకు మృతదేహాన్ని ఘటనా స్థలంలోనే ఉంచినట్టు ఎస్‌ఐ తెలిపారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. ఆత్మహత్యకు ముందు పుట్టింటి వారితో ఫోన్‌లో మాట్లాడినట్టు గుర్తించారు. వివాహిత బలవన్మరణంపై పలు అనుమానాలు ఉన్నట్టు తెలిపారు.

9న ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా

నర్సీపట్నం: ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. ఈ మేళాకు 10 నుంచి 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ముందుగా రిలీవ్ అభ్యర్థులు ఐటీఐలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జెరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- రెండో సారి సీఎంగా జగన్‌ను గెలిపించే బాధ్యత మనదే
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు

చోడవరం: ప్రజా సంక్షేమ పాలనందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి గెలిపించే బాధ్యత సమష్టిగా తీసుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ మండల, గ్రామస్థాయి ముఖ్య నాయకులతో మండలంలోని లక్కవరంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విజయావకాశాలపై చర్చించారు. ప్రజల కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లడంతోపాటు అందరికీ తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ధర్మశ్రీ అన్నారు. గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు కలిసికట్టుగా మరలా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు పనిచేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. ప్రజలకు ఏ మాత్రం సంక్షేమం అందించని వారు ఇప్పుడు ఏదో చేస్తామని కళ్లబొల్లి కబుర్లు చెబుతూ రకరకాల పొత్తులతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని హెచ్చరించారు. అటువంటి వారి నుంచి ప్రజలను రక్షించి, వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేలా అంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎంతో కొంత మేలు కలిగిందన్నారు. ఆ విషయాన్ని లబ్ధిదారులకు చెప్పాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఎప్పటికప్పుడు మండల కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు అనేక పథకాలు అమలు చేశారని, వీటిని యువతకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లకు సీఎం జగన్ ఎందుకు మళ్లీ ముఖ్యమంత్రి కావాలో తెలపాలన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలుసుకుని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయే అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఎంపీపీ గాడి కాసు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, కార్యదర్శి వెంపలి ఆనందీశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ పతివాడ అప్పారావు, సర్పంచ్ శీరంరెడ్డి వెంకటరమణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల శంకరరావు పాల్గొన్నారు.

సర్వసిద్ధిలో మట్టి తవ్వకాలపై దాడులు

జేసీబీతోపాటు నాలుగు ట్రాక్టర్ల సీజ్




పట్టుబడిన పొక్లెయిన్

ఎస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి గ్రామానికి ఆనుకున్న పెద చెరువులో రాత్రిళ్లు కొంతమంది అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఇది గమనించి స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారు దాడులు చేసి జేసీబీతోపాటు నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇక్కడ మట్టి తరలింపునకు ఉపయోగించే వాహనాలను పోలీసులకు అప్పగించినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఇరిగేషన్ అధికారులు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధితో మురిసిన మర్రివలస

- రేపు సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ భవనాల ప్రారంభోత్సవం
- రూ.40 లక్షలతో జల్ జీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయిలు



నిర్మాణం పూర్తయిన రైతు భరోసా కేంద్రం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయం భవనం

కె.కోటపాడు : మండలంలోని మర్రివలస గ్రామంలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సీఎం జగన్ లక్ష్యాల మేరకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సంపూర్ణ సహకారంతో గ్రామంలో మౌలిక వసతులు సమకూరాయి. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయిన ప్రాధాన్యతా భవనాల నిర్మాణం

గ్రామంలో రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.20.80 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ కేంద్రం, రూ.24 లక్షలతో రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మూడు ప్రభుత్వ భవనాల నిర్మాణాలను గ్రామంలో ఒకే చోట జరిపారు. దీంతో ప్రజలకు సచివాలయ సేవలతో పాటు, ఆర్బీకే ద్వారా రైతులకు సాగు పరమైన సేవలు, అన్ని రకాలైన సేవలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ద్వారా ఆరోగ్య సేవలు ఇకపై అందనుండడంతో సచివాలయం పరిధి ప్రజల ఆనందానికి అంతులేకుండా పోయింది.

ఇంటింటికీ కుళాయిలు

మర్రివలస గ్రామంలో గల 353 కుటుంబాలకు ఇంటింటి కుళాయిల నిర్మాణానికి రూ.41 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణంతో పాటు, ఇంటింటి కుళాయిల ఏర్పాటు ఇప్పటికే పూర్తయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో పలు ప్రధాన వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాన్ని సుమారు రూ.30 లక్షలతో చేపట్టారు. ఈ అభివృద్ధి పనులు కుడా పూర్తవడంతో పూర్తిస్థాయి మౌలిక వసతులు ఏర్పాటైనట్టేనని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

8న ఘనంగా ప్రారంభోత్సవాలు

మర్రివలసలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి పనులు, జల్ జీవన్ మిషన్ కుళాయిల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటితో పాటు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ప్రభుత్వ కార్యాలయ నిర్మాణాల వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ ద్వారపూడి శ్రీను, వార్డు మెంబర్ ఈర్లె అచ్చిబాబు, యూత్ సభ్యులు గాంధీ, సరస్వతీదేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిని కూడా ఆవిష్కరించనున్నారు.

ఈ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

క్లుప్తంగా

ముగిసిన దుర్గమాంబ ఉత్సవం



డాన్స్ బేబీ డాన్స్‌లో కళాకారుల ప్రదర్శన

కశింకోట: స్థానిక గవరపేటలో ప్రసిద్ధి చెందిన దుర్గమాంబ ఉత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. గురువారం రాత్రి ఇక్కడ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద మహిళల కోలాటాలు, డాన్స్ బేబీ డాన్స్, సంతబయల డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు అత్యంత వేడుకగా జరిగాయి.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సచివాలయం–3కి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరగనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్యనిపుణులు, పీహెచ్‌సీల వైద్యులు హాజరై, రోగుల్ని పరీక్షించి, మందులు అందిస్తారని పేర్కొన్నారు. సచివాలయ పరిధి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగదు

తుమ్మపాల: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై బీజేపీ ట్విట్టర్ ద్వారా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీ గ్రాఫ్ రోజురోజుకూ తగ్గిపోతుందన్న నిరాశ, నిస్పృహతో రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, మానసిక ఆనందం పొందుతున్నారని ఆక్షేపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారబోస్తూ దేశాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ విధానాలను ప్రశ్నించడంతో రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐఆర్ గంగాధర్, ఆడారి రమేష్‌నాయుడు, పీఎస్ దత్తు, ఎం.కోటేశ్వరరావు, కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, బుద్ద కిషోర్, రుత్తల సూర్య కుమారి, తుట్టా రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
మంత్ ఆఫ్ మధు	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 662 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,620	4,620
మొదటి రకం	4,150	4,410
రెండో రకం	3,950	4,240
మూడో రకం	3,800	4,180

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–14 యూనిట్లు, బీ పాజిటివ్–16 యూనిట్లు, ఓ పాజిటివ్–16 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న వైద్యం.. ఊరంతా ఆనందం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హజ్రత్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి

కశింకోట: మండలంలోని జి. భీమవరం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 442 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 101 మంది కంటి రోగులకు పరీక్షలు జరిపి 15 మందికి కంటి ఆపరేషన్లు, 86 మందికి కళ్లద్దాలను సిఫార్స్ చేశారు. జి.భీమవరంతోపాటు సచివాలయ పరిధిలో ఉన్న సింగవరం, లాలం కొత్తూరు, అడ్డాం, చిన్నయ్యపాలెం, సుందరయ్యపేట, ఆనందపురం, వెంకన్నపాలెం గ్రామాల నుంచి వ్యాధిగ్రస్తులు పెద్ద ఎత్తున శిబిరానికి హాజరయ్యారు. వీరికి వైద్యులు మనీషా, యు.రమేష్, హజ్రత్, రవితేజ, భూషణ్ తదితరులు సేవలందించారు. బీపీ, సుగర్, మోకాళ్ల నొప్పులు, శరీర నొప్పులు, ఇతర రుగ్మతలకు వైద్య సేవలు పొందారు. స్పాట్ రిజిస్ట్రేషన్, ఇంటింటి సర్వేలో గుర్తించి వ్యాధిగ్రస్తుల కోసం, రక్త పరీక్షలకు వేర్వేరు విభాగాలు ఏర్పాటు చేసి సేవలందించారు. సురక్ష వైద్య శిబిరాలపట్ల సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

మెడ, వెన్ను నొప్పితో నరకం



ఎనిమిదేళ్లుగా మెడ, వెన్ను నొప్పితో బాధపడుతున్నాను. ట్రీట్‌మెంట్ తీసుకున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడటం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నారని తెలిసి, వైద్యం కోసం డాక్టర్లను కలిశాను. పరీక్షించి, అవసరమైన మందుల్ని ఉచితంగా ఇచ్చారు. ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను.

–మారిశెట్టి ఎరుకునాయుడు, జి. భీమవరం.

దీర్ఘకాలంగా తలనొప్పి



దీర్ఘకాలంగా తలనొప్పితో బాధపడుతున్నాను. తగ్గడం లేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చూపించాను. మందులు ఇచ్చారు. ఇంతకు ముందే సుగర్ వ్యాధి ఉంది. గతంలో ప్రైవేటుగా మందులు వాడటం ఆర్థిక భారంగా ఉండేది. మూడు నెలలుగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఉపశమనం కలిగింది. ఆనందంగా ఉంది.

.–పినపాల శాంతి, జి.భీమవరం

రక్తం ఎక్కించేందుకు సిఫార్సు చేశారు



రక్త హీనత ఉంది. మోకాళ్ల నొప్పులూ చాలా కాలంగా ఉన్నాయి. దీంతోపాటు వృద్ధాప్యం కారణంగా నడవ లేక నానా అవస్థలు పడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు పరీక్షించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో రక్తం ఎక్కించుకోవడానికి సిఫార్స్ చేశారు. మోకాళ్ల నొప్పులు తగ్గడానికి మందులు ఇచ్చారు. సంతోషంగా ఉంది.

– సారిపల్లి చిన్నోడు, సింగవరం గ్రామం

నొప్పులు, నీరసం



చాలా కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. సరిగా నడవ లేకపోతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షించి నొప్పులు, నీరసం తగ్గడానికి రెండు రకాల మందులు అందించారు. ఆ మందులు అయిపోయాక మళ్లీ వచ్చి చూపించుకోమన్నారు.

– కొండ్ర అప్పయమ్మ, సింగవరం గ్రామం

మోకాళ్ల నొప్పులకు మందులిచ్చారు



శరీర నొప్పులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురించి మా వలంటీర్ చెప్పారు. ముందుగానే టోకెన్ ఇచ్చారు. ఈ రోజు డాక్టర్లకు చూపించుకున్నా. కాళ్లు, వళ్లు నొక్కి మరీ పరీక్షించారు. ఉచితంగా మందులిచ్చారు. చాలా ఆనందంగా అనిపించింది.

– చిరికి చిన రామునాయుడు, లాలం కొత్తూరు

చూపు మందగించింది



కంటి చూపు సమస్యతో బాధపడుతున్నాను. శిబిరంలో కళ్ల డాక్టర్‌ను కలిశాను. రెండు కళ్లనూ పరీక్షించారు. ఆపరేషన్ చేయాలన్నారు. ఇక్కడి వాళ్లే ఆపరేషన్‌కు తీసుకు వెళ్తామన్నారు. అప్పటి వరకు అవసరమైన మందులిచ్చారు. వాటిని క్రమం తప్పకుండా వాడాలని చెప్పారు.

– కూండ్రపు సన్యాసమ్మ, లాలంకొత్తూరు

నడవలేకపోతున్నా



ఒళ్లంతా ఒకటే నొప్పులు. ఎక్కడికక్కడ పట్టేసినట్టు ఉంటుంది. నడవడానికి చాలా ఇబ్బంది పడుతున్నాను. కాసేపు ఒక దగ్గర కూర్చుని మళ్లీ లేచి నడవాలంటే నరకం కనిపిస్తుంది. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్ పరీక్షించారు. మందులు ఇచ్చారు. జాగ్రత్తలు చెప్పారు.

– శానాపతి నాగలక్ష్మి, జి. భీమవరం.

అన్ని పరీక్షలూ చేశారు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నాను. సుగర్, బీపీ, రక్త హీనత తదితర అన్ని రకాల పరీక్షలు చేశారు. రిపోర్టులన్నీ చూసి బాగానే ఉందన్నారు. మందులు ఇచ్చారు. గ్రామాల్లో ఉండేవారికి ఇలాంటి శిబిరం చాలా ఉపయోగకరం.

– పచ్చికూర సూర్యనారాయణ, జి.భీమవరం

తూటికాడ కషాయంతో సుడి దోమ నివారణ

అనకాపల్లి రూరల్: తూటికాడ కషాయంతో వరి పంటలో సుడి దోమను సులభంగా నివారించవచ్చని ప్రకృతి వ్యసాయం మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు అన్నారు. మండలంలోని బవులువాడలో శుక్రవారం సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి సాగును రైతులు చేపడుతున్నారు. ప్రస్తుతం వరి పంటను సుడి దోమ ఆశించడంతో దాని నివారణ కోసం రైతులు ఎలాంటి పద్ధతులు పాటించాలో వివరించారు. తూటికాడ కషాయం తయారీ విధానాన్ని, పంటపై ఎలా పిచికారీ చేయాలో రైతులకు ప్రయోగాత్మకంగా చూపారు. తూటికాడ, ఆవు మూత్రంతో కషాయాన్ని తయారు చేయడానికి రూ.2 వేలు ఖర్చవుతుందని, ఈ విధంగా పండించిన పంటలకు సమీప నగరాల్లో మంచి గిరాకీ ఉంటుందని పేర్కొన్నారు. సేంద్రీయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులకు తమ శాఖ ధ్రువీకరణ చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడైనా ఈ ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుందన్నారు. స్థానిక మార్కెటింగ్ ప్రతినిధి ఎస్ఎఫ్ఏ వర్మ, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి సత్యారావు, వెంకటరమణ, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



తూటికాడ కషాయం తయారీని రైతులకు వివరిస్తున్న సిబ్బంది

నేడు మార్టూరులో 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి'

అనకాపల్లిటౌన్: ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి కార్యక్రమాన్ని మండలంలోని మార్టూరు క్రీడామైదానంలో శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు, మండల సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాల్సిందిగా కోరారు.

'వాకర్స్ క్లబ్' లాంగ్ వాక్ నేడు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు లాంగ్ వాకింగ్ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూచౌక్ నుంచి పెరుగు బజార్ జంక్షన్, రింగ్‌రోడ్డు, రైల్వేస్టేషన్ రహదారి, నాయుళ్లవీధి, రామచంద్ర థియేటర్ మీదుగా జార్జిక్లబ్‌కు లాంగ్ వాకింగ్ చేరుకుంటుందన్నారు. అనంతరం క్లబ్‌లో సమావేశం నిర్వహించి, 2024 ఏడాదికి నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

తుమ్మపాల: పదోన్నతుల విషయంలో సమన్యాయం పాటించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్టు డిపార్ట్‌మెంట్(ఏపీపీటీడీ) జిల్లా కార్యదర్శి డీఎస్ మూర్తి కోరారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రెండు రోజుల నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నిరసనలో భాగంగా శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను పునరుద్ధరించాలని, ఇంక్రిమెంట్లలో జరుగుతున్న అవకతవకలను సరిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

యజ్ఞంలా.. జగనన్న ఆరోగ్య సురక్ష

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- వైద్య సేవలపై సర్వత్రా హర్షం



జి.భీమవరంలో డీఎంహెచ్‌వో హేమంత్, వైద్యులకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహణపై అధికారులను అభినందిస్తున్న కలెక్టర్



వైద్య శిబిరంలో లబ్ధిదారులకు ఓపీ కార్డులు అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు



స్థానికులను వైద్య శిబిరానికి తరలించేందుకు ఏర్పాటు చేసిన ఆటోలతో భీశెట్టి జగన్

కశింకోట: ఓ యజ్ఞంలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మండలంలోని జి.భీమవరం సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఏర్పాట్లను, సేవలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులను ప్రశంసించారు. పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనపై ఆసక్తి చూపారు. ప్రత్యేకంగా అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పౌష్టికాహార ప్రాధాన్యత గురించి గర్భిణులు, బాలింతలు, యువతకు అవగాహన కలిగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత ఆదిలక్ష్మికి సూచించారు. పౌష్టికాహార ప్రదర్శన నిర్వహిస్తున్న తీరును అభినందించారు. అనంతరం వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎంతమంది వ్యాధిగ్రస్తులను సర్వేలో గుర్తించారు, స్పాట్ రిజిస్ట్రేషన్ ఎంతమంది చేసుకున్నారన్న వివరాలను వైద్యురాలు మనీషాను అడిగి తెలుసుకున్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధి 12 సచివాలయాల్లో శిబిరాలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. శిబిరాల నిర్వహణకు తమతో పాటు పక్కనున్న కశింకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సహకారం తీసుకుంటున్నామన్నారు. నిర్ణీత సమయపాలన పాటించి, శిబిరానికి వచ్చే రోగులందరికి సేవలందించి డేటా నమోదు చేయడం పూర్తయ్యాకే శిబిరాన్ని ముగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్‌కు సూచించారు. శిబిరాల నిర్వహణ చూస్తున్న ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఇతర సిబ్బందిని ప్రశంసించారు. మందుల పంపిణీ, కంటి వైద్య శిబిరం స్పాట్ రిజిస్ట్రేషన్, జగనన్న గోరుముద్దలో అందించే సరకులు, పౌష్టికాహారం గురించి వివరిస్తూ విద్యా శాఖ తరఫున ఏర్పాటు చేసిన స్టాల్, రక్త పరీక్షల విభాగాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించారు. ఎన్ని గ్రామాల్లో ప్రకృతి సాగు జరుగుతుందో.. సిబ్బందిని అడిగి గురించి తెలుసుకున్నారు.

442 మందికి వైద్య సేవలు

సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎంపీపీ కలగా లక్ష్మి ప్రారంభించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 442 మంది వైద్య సేవలు పొందారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైద్యులు కవిత, యు.రమేష్, కోట సునీల్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, ఎంపీటీసీ సభ్యుడు బి.శంకరరావు, పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. శుక్రవారం అనకాపల్లి మండలం కొత్తూరు కృష్ణాపురం ఎంపీపీ పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో వైద్య పరీక్షల తీరు పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్‌ను తిలకించారు. వివిధ దశల్లో రోగులకు స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది చేస్తున్న స్క్రీనింగ్, వైద్య పరీక్షలను డీఎంహెచ్‌వో ఏ హేమంత్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకూ వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ప్రజలు రూ.లక్షలు ఖర్చు చేసుకోకూడదని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. క్యాంపులను సక్రమంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంపీడీవో, తహసీల్దారు, జోనల్ కమిషనర్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పర్యవేక్షణకు నోడల్ అధికారులను ప్రభుత్వం నియమించిందన్నారు. వైద్య శిబిరంలో ఓపీకి 461 మంది వచ్చారు. వీరిలో ముగ్గురిని పెద్దాస్పత్రికి రిఫర్ చేసినట్టు వైద్యులు తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి ప్రజలను తరలించేందుకు వైఎస్సార్ సీపీ స్థానిక నేత భీశెట్టి జగన్ తన సొంత నిధులతో రెండు ఆటోలను ఏర్పాటు చేశారు. ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు పీఎస్ఎస్ ఎన్ జోసఫ్, భీశెట్టి జగన్, గ్రామ సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, మురుగుర్తి సంతోష్ కుమార్, వెలుగుల లక్ష్మి, పలువురు అధికారులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు

సీఎం జగన్‌తోనే సుపరిపాలన



కశింకోటలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- టీడీపీ, జనసేనలది అక్రమ సంబంధం
- నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమావేశంలో మంత్రి అమర్‌నాథ్

కశింకోట: రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలో 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి' కార్యక్రమ సన్నాహక సమావేశంలో భాగంగా పార్టీ నియోజకవర్గ శ్రేణులు, అభిమానులు, గ్రామ వలంటీర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పక్ష పార్టీలు అన్నీ ఏకమై సీఎం జగన్‌ను ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని ధీమా వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒకప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబుతో పొత్తు పెట్టుకొని, ఆ తర్వాత విడిపోయి, మళ్లీ ఇప్పుడు పొత్తు కుదుర్చుకోవడాన్ని చూస్తే విడాకులు తీసుకున్న వాళ్లు మళ్లీ పెళ్లి చేసుకున్నట్లు ఉందని, వీరిది అక్రమ సంబంధమని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎలాంటి మేలు చేయలేదని ఆక్షేపించారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఆరంభం నుంచే 98 శాతం మేర హామీలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే పథకాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయన్నారు. ఈ నెల 11 నుంచి ప్రారంభించనున్న 'ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి'కార్యక్రమంలో మండల పార్టీ ముఖ్య నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండలాధ్యక్షులు కచ్చితంగా పాల్గొనాల్సిందిగా కోరారు. ప్రతి గ్రామంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ఆయా ప్రాంతాల్లో చేపట్టిన వివిధ పథకాల కింద లబ్ధి వివరాలను పొందుపరుస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు సచివాలయ పరిధిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాలని, ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై పార్టీ జెండా ఎగుర వేయాలన్నారు. రాత్రి 7 నుంచి 9 వరకు గ్రామంలో ప్రముఖ నాయకులు, పెద్దలను పిలిచి చంద్రబాబునాయుడు పాలనకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు వ్యత్యాసాన్ని వివరించి, వారి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఆ రాత్రి గ్రామంలో బస చేసి, మర్నాడు అదే గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జగన్ సుపరిపాలన గురించి ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అనకాపల్లి అభివృద్ధిని అడ్డుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తుండటం శోచనీయమన్నారు. నియోజక వర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మంత్రి అమర్‌నాథ్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఎంపీపీలు కలగా లక్ష్మి, గొర్లి సూరిబాబు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఆర్ఈసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఘనంగా చవితి అన్నసమారాధనలు



వినాయకుడి సన్నిధిలో దాడి రత్నాకర్



కోట్నివీధి అన్నసమారాధనలో కోరుకొండ రాఘవ

అనకాపల్లిటౌన్: అన్ని దానాలకంటే అన్నదానం ఎంతో గొప్పదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక కస్పావీధిలో విశ్వకర్మ భగవాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల్లో భాగంగా గురువారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21వ రోజున నిర్వహించే స్వామివారి అనుపు మహోత్సవంలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పట్టి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు రత్నాకర్‌ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజీబాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు మత్తూర్తి గంగారావు, సభ్యులు కోటిపల్లి శ్రీను, తణుకు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోట్నివీధిలో అన్నసమారాధన

స్థానిక కోట్నివీధిలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట మరిడిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి వైద్య సేవలపై వినతి

అనకాపల్లిటౌన్: వైద్యాలయం రోగుల పాలిట దేవాలయం కావాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులపట్ల దురుసుగా ప్రవర్తించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ఎమర్జెన్సీ కేసులకు తక్షణమే అత్యవసర సేవలు అందించాలన్నారు. గర్భిణుల వార్డుల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆస్పత్రిలో ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్ మిషన్ల ఏర్పాటు తదితర డిమాండ్లను వినతిప్రతంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ప్రజాసంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజు, పల్లా సత్యఅప్పారావు, ముగడా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం

సీఐ రంగనాథం

సబ్బవరం: సహ విద్యార్థులతో కలసిమెలసి ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీఐ పైడి రంగనాథం సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ వల్ల అనర్థాలు,సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీ కృష్ణ ఆదేశాల మేరకు విద్యా సంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దిశ యాప్ వినియోగంతో పాటు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి, ఎస్ఐ ఎల్. సురేష్, అధ్యాపకులు డాక్టర్ వి. నివేదిత, బి. లక్ష్మి, ఎంవీ రామకృష్ణ, డాక్టర్ ఎస్. సత్యనారాయణ, ఎం. గోవిదం రావు, డాక్టర్ ఎల్. గణేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ రంగనాథం